క్లుప్తంగా

'వన మహోత్సవం' భూమి పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో వర్షాలు కురిసిన వెంటనే వెయ్యి మొక్కలను నాటేందుకు అవసరమైన ఎకరం భూమిని పరిశీలించారు. భూమిని చదును చేసి సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జగన్నాథపురంలో ఉపాధి హామీ సిబ్బంది జాబ్‌కార్డు రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రంగా, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

నేడు 'సింగరేణి పాట' కోసం ఆడిషన్స్

కొత్తగూడెంటౌన్: మిట్టపల్లి స్టూడియో ఆధ్వర్యాన సింగరేణి పాట కోసం కళాకారులను ఎంపిక చేసేందుకు కొత్తగూడెంలోని పద్మశాలి భవన్‌లో శుక్రవారం ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు గాజుల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సంస్థపై మిట్టపల్లి సురేందర్ పాట రచించగా.. సింగరేణి ప్రాంతీయులకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆసక్తి ఉన్న వారు ఆడిషన్స్‌కు హాజరు కావాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా అభిమన్యు



ఇల్లెందు: ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఇల్లెందుకు చెందిన బయ్యా అభిమన్యు నియామకం అయ్యారు. గురువారం ఇల్లెందులో మాట్లాడుతూ... ఈ నెల 15,16 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో 33 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరు కాగా కొత్తగూడెం జిల్లా నుంచి జిల్లా తనను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నట్లు తెలిపారు.

బ్యాంకర్లతో జీఎం సమావేశం

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులు తమ అకౌంట్లను కార్పొరేట్ అకౌంట్లుగా మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలంలో స్టేట్ బ్యాంక్ అధికారులతో ప్రమాద బీమాపై అవగాహన సమావేశం నిర్వహించారు. బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగులు తమ అకౌంట్లను కార్పొరేట్ అకౌంట్లుగా మార్చుకుని రూ.1.15 కోట్ల ప్రమాద బీమా పొందాలని సూచించారు. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు మల్లారపు మల్లయ్య, జీవీ మోహన్‌రావు, బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, కొత్తగూడెం సీఎం సేల్స్ మేనేజర్ రమేష్, ఇల్లెందు ఎస్‌బీఐ మేనేజర్ పీసీ ప్రధాన్, సుదిమళ్ల మేనేజర్ రోహిత్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

22 లోగా డిపాజిట్ చేయాలి

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 24వ తేదీన వారపు సంత వేలంపాట నిర్వహించనున్న నేపథ్యంలో పాల్గొనేవారు 22వ తేదీ లోపు రూ.10 లక్షలు డిపాజిట్ డీడీ, సాలవెన్సీ సర్టిఫికెట్, ఆరు పోస్ట్ డేటెడ్ చెక్కులను కార్యాలయంలో సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీన కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలంపాట జరుగుతుందని పేర్కొన్నారు.

ఎప్పుడు పూర్తయ్యేనో?

సా..గుతున్న చెరువు రక్షణ పనులు

- రూ.25 లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరు
- అసంపూర్తిగా పిల్లర్ల నిర్మాణం
- వారంలో పూర్తి చేస్తామంటున్న మున్సిపాలకులు


కలుషితం అవుతున్న తాగునీటి చెరువు

ఇల్లెందు: ఇల్లెందు తాగునీటి చెరువుకు మంచి పేరు ఉంది. ఇతర నీటి అవకాశాలు లేని నాటి నుంచి నేటి వరకు ఈ పట్టణానికి తాగునీటిని అందిస్తోంది. అంతే కాదు ఈ చెరువు నీరు రుచిగా ఉంటాయి. ఏ అనారోగ్యం దరి చేరదని కూడా స్థానికులు నమ్ముతారు. కాలక్రమేణా ఈ రక్షణ లేకపోవడంతో తాగేందుకు ఉపయోగపడడం లేదు. పశువులు, చెత్తచెదారం, బతుకమ్మ పూలు, గణేష్ విగ్రహాలు కూడా ఈ చెరువులో వదిలి చేతులు దులుపుకున్నా, చెరువులో దూకి తనువు చాలించిన వారు రెండు మూడు రోజులకు శవమై దొరికినా ఈ చెరువు నీటిని ఒకటి రెండు రోజులు వాడకుండా మూడో రోజు అవే నీటిని తాగిన రోజులు ఉన్నాయని పట్టణ ప్రజలు అంటున్నారు. అలాంటి ఇల్లెందు పట్టణ నడిబొడ్డున గల తాగునీటి చెరువు రక్షణ కోసం ఈనాటి పాలకులు శ్రీకారం చుట్టారు. కానీ ఈ నిర్మాణ పనులు నెలలుగా సా...గుతున్నాయి.

ఈ వర్షాకాలం లోపు పూర్తయ్యేనా...?

చెరువు కట్ట మీద ఇరువైపులా కట్టమీదకు వెళ్లకుండా గేట్లు ఏర్పాటు చేశారు. రోడ్డు వైపు ఫెన్సింగ్ పనులు చేపట్టారు, కానీ ఏడాది కాలంగా సాగుతూనే ఉన్నాయి. గుండాల రోడ్‌ను వెంబడిస్తూ రోడ్డు పక్కనే చెరువు ఉండటం వల్ల పశువులు, బహిర్భూమికి వెళ్లిన వారు చెరువులోకి దిగి మలినం చేస్తున్నారు. ఏళ్లుగా చెరువుకు రక్షణ కల్పించాలని పలుమార్లు మున్సిపాలకుల దృష్టికి పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు తీసుకుని రాగా గతేడాది పనులకు శ్రీకారం చుట్టారు. వచ్చే వర్షాకాలం లోపు పూర్తి చేస్తే చెరువును రక్షించిన వారు అవుతారు. వర్షాలకు చెరువు నిండి అందులోని పాత నీరు వెళ్లి కొత్త నీరు నిలుస్తుంది. రక్షణ వల్ల నీరంతా పరిశుభ్రంగా మారుతుంది. వర్షాలకు ముందే పనులు పూర్తి చేస్తే అదనపు ఖర్చు తగ్గుతుంది.

రూ.25 లక్షల డీఎంఎఫ్ నిధులు..

చెరువు కట్ట నుంచి మొండితోగు రోడ్డు వరకు రోడ్డు వెంట ఫెన్సింగ్ నిర్మాణం చేయాలని తలంచారు. డీఎంఎఫ్ నిధులు రూ.25 లక్షలతో ఈ పనులు చేపట్టారు. 300 పిల్లర్లు, పునాదిలో బీమ్ వేసి ఫెన్సింగ్ నిర్మాణం చేయాలని పనులు ప్రారంభించారు.

అసంపూర్తిగా పిల్లర్ల నిర్మాణం..

ఇప్పటి వరకు 180 పిల్లర్లు, పునాది బీమ్ నిర్మాణం పూర్తి చేశారు. మరో 120 పిల్లర్లు, పునాదిలో బీమ్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఇది పూర్తి చేస్తే చెరువులోకి పశువులు, మనుషులు వెళ్లే అవకాశం ఉండదు. చెరువు కట్టకు ఇరువైపులా గేట్లు కూడా ఉన్నందున లాక్ చేస్తే మరింత రక్షణగా ఉంటుంది.


వర్షాకాలంలో కళకళ లాడుతున్న చెరువు (ఫైల్)

వారంలో పూర్తి చేస్తామంటున్న అధికారులు..

ఇదిలా ఉండగా మరో వారంరోజుల్లో మొత్తం పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సెలవిస్తున్నారు. కాంట్రాక్టర్ జాప్యం కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని, వర్షాకాలానికి ముందే పూర్తి చేసి చెరువు నిండిన తర్వాత లోపలికి వెళ్లకుండా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

పనులు పూర్తి చేయాలి..



ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. వచ్చే వర్షాకాలం నాటికి అయినా పూర్తి చేస్తే ఉపయోగంగా ఉంటుంది. చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం వల్ల చెరువులోని నీరు పరిశుభ్రంగా ఉంటుంది. రానున్న కాలంలో బోటింగ్ లాంటిది ఏర్పాటు చేస్తే పర్యాటకంగా మారే అవకాశం ఉంటుంది.

– సందిరి రమేష్, చెరువు కట్ట ఏరియా, ఇల్లెందు

నీరు శుభ్రంగా ఉంటాయి..



సుదీర్ఘ చరిత్ర కలిగిన తాగునీటి చెరువు రక్షణ చర్యల వల్ల ఎంతో ఉపయోగం. పరిశుభ్రతను పాటించేందుకు నీరు మలినం కాకుండా చూసేందుకు ఫెన్సింగ్ చేయాల్సిన అవసరం ఉంది. పశువులు, ప్రజల తాకిడి ఎక్కువ ఉండే గుండాల రోడ్‌లో ఫెన్సింగ్ వేస్తే చెరువు పరిశుభ్రంగా ఉంటుంది.

– కటకం పద్మావతి, 2వ వార్డు కౌన్సిలర్

వారం రోజుల్లో పూర్తి చేస్తాం..



చెరువు రక్షణ పనులు వారం రోజుల్లో పూర్తి చేస్తాం. వచ్చే వర్షాకాలం చెరువు పూర్తి రక్షణలో ఉంటుంది. జంతువులు చెరువులోకి వెళ్లే అవకాశం లేకుండా ఫెన్సింగ్ చేస్తున్నాము. పెండింగ్ పనులతో పాటు అన్ని పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చినాము.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, చైర్మన్

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

టేకులపల్లి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల కార్మికుల సమస్యల పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు దుబాకుల ప్రసాద్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మూడు బిచ్చు, కార్యదర్శి సరికొండ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అన్నాజీ, ఎర్రయ్య, బాలాజీ, మహేష్, చాపల యశోద, తావుర్యా పాల్గొన్నారు.

జీతాలు పెంచాలి


మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

జూలూరుపాడు: పరిశ్రమల్లో పని చేస్తున్న కోటి మంది కార్మికుల వేతనాల జీఓను సరిచేసి జీతాలు పెంచాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్టూ కొత్తగూడెం ఏరియా మహాసభను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇఫ్టూ జెండాను కార్మికురాలు నాగక్క ఆవిష్కరించారు. అనంతరం సంతాప తీర్మాన్ని జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు ప్రవేశపెట్టారు. యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... గడిచిన పదేళ్లలో కార్మికుల జీతాలు పెరగకపోగా, ఆర్థికంగా నష్టపోయినట్లు చెప్పారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో లేబర్ కోడ్స్ రద్దుకై రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన జీపీ కార్మికులు, సింగరేణి స్కీం వర్కర్స్‌ను రెగ్యులైజ్ చేస్తామన్న హామీ నెరవేర్చాలన్నారు. కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. కార్మికుల పోరాటాలకు మాస్‌లైన్ పార్టీ అండగా ఉంటుందన్నారు. బానోత్ ధర్మా, గోనెల రమేష్, గోపాల్‌రావు, రాజశేఖర్, పాయం వెంకన్న, శిరీష, అరుణ, ధన్వంతరావు, వినోద్, పద్మ పాల్గొన్నారు.

రక్షణ, సమయపాలన పాటించండి

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులు విధుల పట్ల రక్షణ, సమయపాలన పాటించాలని జేకే ఓసీ ప్రాజెక్ట్ అధికారి బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఇల్లెందులోని జేకే ఓసీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. యాంత్రికశక్తిని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. యంత్రాల పనిగంటలు పెంచాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను అధిగమించాలని, ఉత్పత్తి రవాణాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, పర్సనల్ అధికారి సుధాకర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి సంజీవచారి, ఐఎన్‌టీయూసీ ఫిట్ కార్యదర్శి బాబూరావ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఇల్లెందురూరల్: చల్లసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాజ సేవా ట్రస్ట్‌కు నోటీసులు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి రామవరం సీఆర్‌పీ క్యాంపులోని ఒక సమాజ సేవా ట్రస్ట్‌కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రస్ట్ అభ్యర్థన మేరకు దాతృత్వ కార్యకలాపాలకు వినిగించేలా గతంలో భూమి కేటాయించారు. అయితే, ఆ భూమిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ అద్దె పొందుతున్నట్లు తేలడంతో నోటీసు జారీ చేశారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

జూలూరుపాడు: జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రం పక్కన సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే మట్టి రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఎస్సీకాలనీలో వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో అంధకారంగా ఉందని చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు, నాయకులు



కొత్తగూడెంఅర్బన్: కలెక్టర్‌ను సన్మానిస్తున్న సమాచార హక్కు సంరక్షణ సభ్యులు, సీపీఐ కౌన్సిలర్లు


చుంచుపల్లి: పాటిల్‌ను సన్మానిస్తున్న ఎంపీఓలు


ఇల్లెందు: జితేష్‌ను కలిసిన జీఎం జాన్‌ఆనంద్

నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జితేష్ వి.పాటిల్‌ను గురువారం కలెక్టర్ చాంబర్‌లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ అన్ని విషయాలపై సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. – సాక్షి నెట్‌వర్క్

ఏఐటీయూసీ.. కార్మికవర్గానికి దిక్సూచి

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక జీవులకు ఏఐటీయూసీ దిక్సూచి వంటిదని, కార్మికులకు ఏ కష్టం వచ్చినా బాసటగా నిలిచే సంఘం ఏఐటీయూసీ అని సంఘం జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా సారపాకలో ఈనెల 23న జరుగనున్న ఏఐటీయూసీ జిల్లా ద్వితీయ మహాసభల ప్రచార కరపత్రాలను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ... కార్మికులు, ఉద్యోగుల హక్కులు, సౌకర్యాలకు స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే పోరాడుతోదని, 8 గంటల పనివిధానం, సంక్షేమ చట్టాలను సాధించి పెట్టిందని ఏఐటీయూసీ అన్నారు. ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న చట్టాలను ప్రస్తుత మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, వి.మల్లికార్జున్‌రావు, జి.నగేష్, జే.గట్టయ్య, రాజేశ్వరరావు, నేరెళ్ల రమేష్, కొత్తూరి రవి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసం శ్రమిద్దాం..


మాట్లాడుతున్న ఏటీడీఓ రాధ

ఇల్లెందురూరల్: ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పాఠశాల ప్రారంభం నుంచి సమష్టిగా శ్రమిద్దామని ఏటీడీఓ సూర్నపాక రాధ అన్నారు. మండలంలోని ఏటీడీఓ కార్యాలయంలో గురువారం ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల వార్డెన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఆశ్రమంలో చేరిన ప్రతి విద్యార్థికి చదువు పట్ల ఆసక్తి పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆటపాటలకు కూడా ప్రాధాన్యమిస్తూ స్టడీ అవర్లు నిర్వహిస్తూ ప్రతీ విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. దీనికోసం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని, ఈ విషయంలో తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

23న ఇఫ్టూ కౌన్సిల్ సమావేశం


మాట్లాడుతున్న కృష్ణ

ఇల్లెందురూరల్: ఈ 23న ఇఫ్టూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం మండలంలోని సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాంసింగ్ తెలిపారు. చల్లసముద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికవర్గానికి ఉపయోగపడే 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా మార్చారని గుర్తుచేశారు. ఈ కారణంగా యూనియన్ పెట్టుకునే హక్కును కార్మికులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులను తొలగిస్తూ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం తెరలేపుతోందని ధ్వజమెత్తారు. రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసీ, విమానయానం తదితర సంస్థలను ప్రైవేటు సంస్థలకు విక్రయించే ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సింగరేణిలో ఆరు బ్లాక్‌లను ఈనెల 30న వేలంపాటకు పిలుపునిచ్చారని, వేలంపాటను రద్దు చేసి ఆరు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. పలు అంశాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. కాంతారావు, మూతి రాంబాబు, దుర్గాప్రసాద్, సనప రాంబాబు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఎస్‌ఏపీ పోర్టల్ ఏర్పాటు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి వ్యాప్తంగా ఉన్న సింగరేణి క్వార్టర్ల స్థితిగతులు తెలుసుకోవడానికి క్వార్టర్స్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్ (ఎస్ఏపీ) పోర్టల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఏజీఎం పర్సనల్ (వెల్ఫేర్) కోడూరి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కార్పొరేట్ కార్యాలయంలో ఎస్ఏపీ పోర్టల్‌పై అన్ని ఏరియాల పర్సనల్, ఎస్టేట్స్ విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పోర్టల్‌లో సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లోని క్వార్టర్ల వివరాలు, ఎలాంట్‌మెంట్, ఖాళీగా ఉన్న అంశాల వివరాలను అప్‌లోడ్ చేయ నున్నట్లు తెలిపారు. అనంతరం ఈఆర్‌పీ ప్రాజెక్ట్ మేనేజర్ హరిప్రసాద్ టీమ్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్ వినియోగం గురించి, వాటి ఉపయోగం గురించి అన్ని ఏరియాల అధికారులకు వివరించారు. అనంతరం వాటిపై సందేహాలను నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డీజీఎం ఎస్టేట్స్ ఎస్.వెంకటాచారి, ఎస్టేట్స్ మేనేజర్ హరియా, డీవైపీఎం అనిల్, కే.ప్రవీణ్, ఎం.శ్రీనివాస్, శివకుమార్, జీకే కిరణ్‌కుమార్, సీనియర్ పీఓ ఎం.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


చుంచుపల్లి: విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

నులి పురుగుల నిర్మూలనలో భాగంగా గురువారం పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యులు మాట్లాడుతూ.. పిల్లలు చేతిగోర్లను కత్తిరించుకొని శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో చిన్నారికి మాత్ర వేస్తున్న డాక్టర్ కవిత


పాల్వంచరూరల్: నాగారం స్కూల్‌లో..


కొత్తగూడెంటౌన్: సన్యాసి బస్తీ అంగన్‌వాడీలో..


టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

మున్సిపాలిటీకి తగ్గిన ఆదాయం..!

- డైలీ మార్కెట్, కబేళాకు వేలంపాట
- సీల్డ్ టెండర్‌కు మొగ్గు చూపని వ్యాపారులు


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీకి ఆదాయం చేకూర్చే డైలీ మార్కెట్, కబేళాలకు గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు వ్యక్తులు మాత్రమే బహిరంగ వేలంపాటలో పాల్గొని డైలీ మార్కెట్, కబేళాలను దక్కించుకున్నారు. తొలుత సీల్డ్ టెండర్ ప్రక్రియ ప్రారంభించగా ఎవరూ దాఖలు చేయలేదు. దీంతో అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించారు. డైలీ మార్కెట్‌కు రూ.50 లక్షలతో మొదలుపెట్టగా పాటలో మోడె మోహన్‌రావు, శుశీల్‌రాజ్ పాల్గొన్నారు. రూ.16.35 లక్షలకు మోడె మోహన్‌రావు దక్కించుకున్నారు. అనంతరం వారపు సంత పాటను రూ.7.35 లక్షలకు మోడె మోహన్‌రావు దక్కించుకోగా, మున్సిపాలిటీకి ఇది సరైన ఆదాయం కాదని, వేలంపాటను 24వ తేదీకి వాయిదా వేశారు. అనంతరం కబేళాను రూ.60 వేలకు మోడె మోహన్‌రావు దక్కించుకున్నారు. జూలై 1వ తేదీ నుంచి టెండర్ దక్కించుకున్న వారు ఫీజులను వసూళ్లు చేసే కార్యక్రమం ప్రారంభించనున్నారు. అయితే గతంలో బ్లాక్ లిస్టులో పెట్టినవారు ప్రస్తుతం వేలంపాటలో పాల్గొనలేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం హర్షనీయం.

తగ్గిన ఆదాయం...

కొత్తగూడెం మున్సిపాలిటీకి ప్రతి ఏడాది కూడా ఆదాయం చేకూర్చే డైలీమార్కెట్, వారపు సంత, కబేళాలకు బహిరంగ వేలంపాట జరిగింది. డైలీ మార్కెట్, కబేళాలకు పోటీ ఎవరూ లేకపోవడం వలన తక్కువకే పాట దక్కించుకున్నారు. గత ఏడాది డైలీ మార్కెట్ రూ.50 లక్షలకు వేలంలో పాడుకోగా ఈ ఏడాది రూ.16.35 లక్షలకు వేలం వచ్చింది. దీంతో పాటు గత ఏడాది రూ.1.20 లక్షలు కబేళాకు రాగా, ప్రస్తుతం రూ.60 వేలకు వేలం పాట దక్కించుకున్నారు.

ఎన్నడూ లేని కొత్త పోకడలు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేని విధంగా డైలీ మార్కెట్, సంత, కబేళాలకు జరిగిన బహిరంగ వేలంపాటలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూర్చోవడం పలు విమర్శలకు తావునిస్తోంది. మున్సిపాలిటీలో గత పది సంవత్సరాలలో ఎన్నడూ మున్సిపల్ చైర్‌పర్సన్ కార్యాలయ బహిరంగ వేలంపాటలో కూర్చున్న దాఖలాలు లేవు. అధికారులు నిర్వహించే కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు కలుగజేసుకోవడం వలన ప్రక్రియ పక్కదారి పట్టే అవకాశాలుంటాయి. అయితే చైర్‌పర్సన్ అధికారులతో కలిసి పాల్గొనడంపై కమిషనర్ శేషాంజన్‌స్వామిని వివరణ కోరగా చైర్‌పర్సన్ సమక్షంలో వేలంపాట నిర్వహించవచ్చని తెలిపారు.